

# చలివ్యాపారం

వి. రాజారామమోహనరావు

కొన్ని సీజనల్ వ్యాపా లుంటాయి ఆ వ్యాపారం చేసేవాళ్ళు ఆ సీజన్ కోసం ఎదురుచూస్తుంటారు. మల్లయ్య, రంగడు నాలుగు రోజులుగా చలికోసం ఎదురుచూస్తున్నారు.

కొద్దిగా మబ్బుపట్టి అప్పుడప్పుడు ఒకటి రెండు చినుకులు పడుతున్నాయి కానీ చలి అంతగ పెరగలేదు. గడిచిన మూడు రోజులకన్నా వాళ్ళిద్దరికీ ఆరోజు వాతావరణం కొంచం ఆశాజనకంగా వుంది. అందుకే సాయంత్రం అరవకుండావచ్చి తమ స్థలంలో చేరిపోయారు.

రెండు లక్షల జనాభా దాటిన టౌన్ అది. చాలా వూళ్ళలాగే ఆ వూరికీ సగం జనాభాకి సరిపడ్డ వసతులేవున్నాయి. రోజురోజుకీ జనం పెరుగుతూనే వున్నారు. పెరుగుతున్న జనంకోసమే అన్నట్టు ఆ వూరికి మాత్రం రెండు రైల్వేస్టేషన్ లున్నాయి. పెద్ద స్టేషన్, చిన్న స్టేషన్.... చిన్న స్టేషన్ వూరికి దగ్గర.... పెద్దస్టేషన్ కొంచం పెద్దది వూరికి దూరం. పెద్ద స్టేషన్ ఎదురుగా తమ పాడుపడ్డ యింటి వసారాలో తీరిగ్గా బైఠాయించారు మల్లయ్య, రంగడు.

"యి యాళ బావుందేలా వుందిరా..." అన్నాడు మల్లయ్య బీడీ వెలిగించుకుంటూ.

"అవును గురూ.... నాకూ అలాగే వుంది...." అన్నాడు రంగడు బీడీ తీస్తూ....

స్టేషన్ బైట పదిపదిహేను రిక్షాలు స్టేషన్ నుంచి బైటకివచ్చే దార్లో రోడ్డు పక్క ఎప్పుడూ వుండే నాలుగు బడ్డీ కొట్లూ తప్ప పెద్ద సందడేంలేదు. రైలు వచ్చినప్పుడు తప్ప ఎప్పుడూ అంతే.... రాత్రి చీకటిపడ్డాక పడకకి కొంతమంది జనం చేరతారు.

బీడీ కాలుస్తుంటే చలిని లోపలికి పిలుస్తున్నట్టుంది. మల్లయ్యకి. ఆ పాడు పడ్డ యింటి వసారా.... ఎదురుగా స్టేషన్ చుట్టూ ఖాళీస్థలం చెట్లు ఆ వాతావరణం ఎన్నోఏళ్ళనుంచీ అలవాటై పోయింది ప్రత్యేకించి ఏ వుద్దేశం లేదు ఏ బంధం లేదు రోజు గడవాలి అంతే పీలున్నంత సుఖంగా రోజు గడపాలి.

పదేళ్ళ క్రితం రౌడీ మల్లయ్యంటే ఆ వూళ్ళో తెలియనివాళ్ళు తక్కువ. వూళ్ళో పెద్దా, చిన్నా చాలామందికి చాలా రకాల అవసరాలుండేవి మల్లయ్యతో.. మల్లయ్యకి అనుకూలంగా గడిచిన రోజులవి.... ఆ రోజుల్లో ఆ తెగింపు ఆ కసి వేరు.... మల్లయ్యవి భార్య వదిలేసి వెంకట్రావుతో లేచిపోయిన కొత్త.

భార్య లేచిపోయిన రోజు బాధకన్నా, ఎక్కువ అయోమయం కమ్ముకుంది మల్లయ్యని. భార్యకి తక్కువ చేసిందేం లేదు. పెళ్ళాంతో కాకుండా కేవలం తన కోసం కావాలనుకున్నదేం లేదు.... కష్టం, సుఖం రెండూ తనతోటే అనుకున్నాడు. అందుకే పెళ్ళయిన నాటినుంచీ ఏ సరదాకీ వెనకాడలేదు.... ఖర్చయినా, అప్పయినా, ఎంతటి కష్టానికైనా సందేహించలేదు. యిల్లు.... భార్యా, తనూ... సుఖం... వీటికోసం రాత్రింబగళ్ళు అన్ని రకాల పనులకి సిద్ధమయ్యాడు. ఆ రోజు రాత్రి లారీ లోడ్‌చేస్తుంటే, దొంగ సరుకని పోలీసులు పట్టుకున్నారు. రెండు రోజులు పోలీస్ స్టేషన్‌లోనే వుండాల్సి వచ్చింది. తిరిగి వచ్చేటప్పటికి యింట్లో పెళ్ళాం లేదు తర్వాత తెలిసింది వెంకట్రావుతో లేచిపోయిన సంగతి.

ఆ రోజే బతుకుమీద మల్లయ్యకున్న ఆలోచన తల్లకిందులైంది. చాలా వాటి మీద నమ్మకం, ఆసక్తి పోయింది.

మల్లయ్యకి చిన్నతనంనుంచీ నా అనేవాళ్ళు లేకపోటంతో వెంకట్రావుని స్నేహితుళ్ళా కాక తోడబుట్టినవాళ్ళా చూశాడు. అలాంటి వెంకట్రావూ, రెండురోజులు జైలుకెడితే మొగుడిమీద నమ్మకం, అభిమానం లేని భార్య.... వాళ్ళిద్దరూ యింట్లో వున్నవన్నీ చక్క బెట్టుకుని లేచిపోటంతో అన్నీ.... బతుకు లోని కక్కుర్తి, కోరిక, సుఖం ఒకరి కొకరు .... యిలా అన్ని విలువలూ చాలా అల్పంగా తోచాయి మల్లయ్యకి.

ఏదో కసి.... ఎక్కడున్నా వెతికి వెంకట్రావుని, పెళ్ళాన్ని చంపాలను కున్నాడు ముందు. కానీ దానిమీద మనసు లగ్నం కాలేదు మల్లయ్యకి. తన చుట్టూ, తన లోపల అంతా చిందర వందర .... ఇలా చిందరవందరగానే బతికాడు. అన్నింటికీ సిద్ధమయ్యాడు. రక్తమంటే భయంలేదు .... దెబ్బలాట లన్నా, కాళ్ళూ చేతులు విరగటమన్నా, విరచటమన్నా బెదురులేదు.... పోలీ సులు, జైలు అన్నా జంకు లేదు.... అందుకే యాడాది తిరక్కుండా వూళ్ళో పేరుమోసిన రౌడీ అయ్యాడు మల్లయ్య.

వూళ్ళో రకరకాల వ్యాపారాలు.... రకరకాల అడ్డదార్లు.... చిన్నా పెద్దా చాలామందికి తెగింపున్న రౌడీ మల్లయ్య



అవసరమయ్యాడు. మల్లయ్యకి చేతి నిండా డబ్బు.... ఏ క్షణాన ఏది చెయ్యా లనిపిస్తే అది చెయ్యటం.... రోజు గడపటం.... శరీరానికి, మనసుకి దిగు లుగా వుండకూడదు.... అంతే.... భార్య,

పాతజీవితం గుర్తు పూర్తిగా మరుగున పడిపోయాయి మల్లయ్యలో.

చాలా ఏళ్ళు ఒంటరిగానే గడిపాడు. అన్నింటిమీద నమ్మకంపోయిన మల్లయ్యకి ఎవర్నీ నేంతియ్యాలనిపించలేదు. కానీ రంగడే మల్లయ్యని పట్టుకు వొదల్లేదు. "గురూ.... గురూ...." అంటూ శిష్యుళ్ళా సేవజేశాడు. శిష్యరికంతో దగ్గరై, చివరికి చెలికాడై పోయాడు.

స్టేషన్ బైట ఆ పాడుపడ్డ యింటి పెద్ద వసారాలోనే యిప్పుడు యిద్దరి మకాం. వసారాకి చివరవున్న ఒక్క గదీ మల్లయ్య అధీనంలోనే వుంది. మిగిలిన యిల్లంతా ఎప్పుడూ తాళంవేసే వుంటుంది. సత్యన్నారాయణ అని వూళ్ళో పేరుమోసిన కంట్రాక్టర్ కట్టించిన యిల్లది. ఆ యిల్లు కట్టటం మొదలు పెట్టిందగ్గర్నించీ అన్నీ ఎదురుదెబ్బలే తగిలాయని యిల్లు అలా వొదిలేశాడు. ఆయనతో మల్లయ్యకి చాలాకాలంగా పరిచయం. ఆ పరిచయం వల్లే ఆ వసారా మల్లయ్య అధీనమైంది.

గడిచిన ఏళ్ళలో వూళ్ళో చాలా మార్పులొచ్చాయి. జనాభా పెరిగింది. కొత్త పెట్టుబడి.... కొత్త వ్యాపారాలు పెరిగాయి.... బిగా రౌడీలు కాకుండా రెండు మూడు గట్టి రౌడీ ముఠాలు తయారయ్యాయి. ఏ ముఠాతోనూ చేరే యిష్టం, వుత్సాహంలేక మల్లయ్య విడిగానే వుండిపోయాడు. రోజురోజుకి మల్లయ్య డిమాండ్ తగ్గుతోంది.... వొంట్లో వోపికా తగ్గింది. వుంటానికి ఆ వసారా నీడ .... అడపా, తడపా కొంచెం సంపాదన .... అలా నడుస్తోంది మల్లయ్యకి.

సుమకారాలు, బంధాలు లేని మల్లయ్య రోజువారి మొండి బతుక్కి అప్పుడప్పుడు మార్పు సుశీల.... సుశీల లక్ష్మీ కంపెనీలో పనిచేస్తుంటుంది. నెలకి ఒకసారో, రెండుసార్లో, రెండునెలలకి ఒకసారో యిలా వీలునిబట్టి సుశీలదగ్గరి కెడతాడు మల్లయ్య .... సుశీలతో సుఖం అంటే.... మందు.... మంచి తిండి.... మొత్తానికి ఆ రాత్రి రంగడికి మల్లయ్యకి ఖర్చు దిట్టంగానే వుంటుంది. యీ మధ్య కొన్ని నెలలుగా ఆ సుఖం లేదు మల్లయ్యకి.

అవకాశాన్ని బట్టి, అదనుని బట్టి మల్లయ్య చేసే సొంత వ్యాపారాల్లో యీ చలివ్యాపారం ఒకటి. రాత్రి ముదిరితే ఆ స్టేషన్ చుట్టూ నిద్రకోసం చేరే జనం చాలామందుంటారు. అలాంటి వాళ్ళకి చలి నుంచి రక్షణగా తమ వసారాల్లో పడుకోటానికి చోటిచ్చి డబ్బు సంపాదించటం చెందేళ్ళుగా అలవాటైంది మల్లయ్యకి. మల్లయ్య చెప్పిన రేటిస్తేనే ఎవరికేనా వసారాలోకి ప్రవేశం. అందుకే నాలుగు రోజుల్నించీ మల్లయ్య, రంగడు చలికోసం ఆదుర్దాగా ఎదురుచూస్తున్నారు.

ముత్తానికి ఆ రాత్రి వాళ్ళ ఆశ ఫలించింది. పెరిగిన చలే కాదు.... దానికి తోడు గాలి.... ఆ వసారా పెద్దది. పక్కపక్కని పడుకుంటే యాభై మంది పైనే పడతారు. ఆ రోజు ముత్తానికి వలభై వరకూ సంపాదించాడు.

'దీనక్క.... రేపూ యిలాగే వుంటే .... యీ కొంచం బాగా సంపాదిస్తే ... సుశీల ఎవ్వారం చూసుకోవచ్చు. ఆ సుఖంచూసి చాలా రోజులై పోయింది.' అనుకున్నాడు మల్లయ్య. మల్లయ్య సంగతి రంగడికి తెలుసు. గురుడితో పాటే తనూ.... అందుకే రంగడికీ హుషారుగా వుంది.

* * *

మర్నాడు చలి మరింత పెంగింది. కోల్డువేవ్ తన ప్రభావం చూపిస్తోంది. పగలే చలి ఎక్కువుగా వుంది. రాత్రి ఎనిమిది దాటేటప్పటికే పాతిక సంపాదించాడు మల్లయ్య. వసారాలో యింకా చాలా చోటుంది. గాజుపెంకుతో చర్మాన్ని గీసినట్టు వేస్తోంది చలిగాలి. వాతావరణాన్నిబట్టి, పరిస్థితినిబట్టి వసారా చేశాడు రేటు మనిషికి రెండు రూపాయలు మల్లయ్య. యివ్వగలిగినవాళ్ళు యిచ్చి వసారాలోకి వస్తున్నారు లేని వాళ్ళలో కొంతమంది "బాబూ.... బాబూ" అని బతిమాలుతున్నారు.

అలా బతిమాలేవాళ్ళకి లొంగటం వ్యాపార లక్షణం కాదని మల్లయ్యకి తెలుసు. అందుకే డబ్బివవు తప్ప యింకెవరి ముఖం వేపూ చూట్టంలేదు.

మల్లయ్య అడిగిన డబ్బివ్వలేనివాళ్లు ఏ చెట్టుచాటో, ఏ చూరు నీడో వెతుక్కోటం కోసం బైలుదేరారు. ఎలా బైలుదేరిన వాళ్ళలో లక్ష్మి వుంది. అంతకీ రంగడ్నీ, మల్లయ్యనీ చాలా రకాలుగా బతిమాలింది. డబ్బివ్వలేని చాలామందిని పొమ్మన్నట్టే లక్ష్మిని పొమ్మన్నారు.

లక్ష్మి, లక్ష్మి మొగుడు ఆ టౌన్‌కొచ్చి మూడు రోజులైంది. మూడు రోజులుగా జబ్బుతోవున్న పసివాడితో పెద్ద ఆసుపత్రిలో పడిగాపులు పడ్డారు. అక్కడా డబ్బుగొడవే. వాళ్ళడిగినంత డబ్బులేదు. డబ్బుంటే కానీ పసివాణ్ణి చేర్చుకోమన్నారు. యిద్దరికైతే ఛార్జీలు చాలవని డబ్బుకోసం లక్ష్మి మొగుడొక్కడే వూరెళ్ళాడు. పొద్దున్నకల్లా వచ్చేస్తా ఏక్కడేనా ఆ స్టేషన్ పరిసరాల్లో ఆ రాత్రికి గడపమని చెప్పి వెళ్ళాడు.

చుట్టూ చీకటి. ..చలి...చచ్చే...దిగులు స్టేషన్‌లోకివెళ్ళి పడుకునే తెగింపు లేదు. అందుకే కాస్సేపు అటూయిటూ కాలు కాలిన పిల్లిలా తిరిగి చివరికి వో చెట్టు నీడకి చేరింది లక్ష్మి.

చలిరాత్రి మరో గంట గడిచింది. వసారా నిండింది. మల్లయ్య జేబూ నిండింది. రంగడితో హుషారుగా బైల్దేరాడు.

వాళ్ళిద్దరికీ ఎముకలు కొరికే చలి

అంతగా తెలియలేదు. వెచ్చగా మందు... ఆతర్వాత కోడికూర. ఆ తర్వాత లక్ష్మీ కంపెనీ. అందులో సుశీల ఆ చలిరాత్రి హుషారు వసారా బతుకునుంచి వేరు. వెధవ పనులు చెయ్యటానికి పెద్దమను షుల ముందు చేతులు కట్టుకు నిలబడే తొత్తుబతుకు నుంచి ఆ రాత్రి వేరు. దెబ్బ లాటలకి, మొరటుతనానికి, మనసు మరింతగా బండబారడానికి ఎన్నోఏళ్ళగా పనికొస్తున్న టానిక్ ఆ రాత్రి అనుభవం వాళ్ళకి.

చాలా నెలలుగా కలలు కన్న సుఖం లభించింది రంగడికి. మల్లయ్య ఆరాత్రి మళ్ళీ కొన్నాళ్ళదాకా వెధవ వసారా బతుకు మామూలుగా బతికేయొచ్చుననే మూడ్‌లో పొద్దున్నే తమ గూటికి తిరి గొచ్చారు.

* * *

వసారాకి వంద గజాల దూరంలో గుంపుగా జనం. గుండెలు పగిలేలా ఏడు స్తోంది లక్ష్మి.... చలనం లేని కొడుకు శవాన్ని వొళ్ళో వేసుకూర్చున్నాడు లక్ష్మి మొగుడు.

అంతకు ముందురాత్రి భయంకర మైన చలికి ఆ పసివాడి జబ్బువొళ్ళు తట్టుకోలేకపోయింది. తెల్లారుఝామునే ఆ కుర్రాడి ప్రాణం పోయినా, పొద్దున్న వరకూ లక్ష్మికి తెలియలేదు. పొద్దున్న లక్ష్మి కుర్రాణ్ణి పరీక్షగా చూస్తున్న సమ యంలో లక్ష్మి మొగుడు వూర్నించి తిరి గొచ్చాడు. ఏడుస్తూనే రాత్రి జరిగిం దంతా చెప్పింది లక్ష్మి. అప్పట్నించీ ఆ మొగుడూ పెళ్ళాం ఏడుస్తూనే వున్నారు.

రాత్రి చలినుంచి ఆ కుర్రాణ్ణి కాపా డ్డానికి రెండు రూపాయలు లేని లక్ష్మి పరిస్థితి ఒకళ్ళనుంచి ఒకళ్ళకి ఆ గుంపులో అందరికీ తెలిసింది.

మల్లయ్యకి, రంగడికీ ఆ పరిస్థితి చూసేటప్పటికి తల తిరిగింది. రాత్రి హుషారంతా దిగిపోయింది. జనం అందరూ తలోమాటా అంటున్నారు.

"దొంగెధవలు.... రెండు రూపాయల కోసం కుర్రాణ్ణి పొట్టనెట్టుకున్నారు...."

"రౌడీ ముండాకొడుకులకి మనసేం వుంటుంది.... రాత్రి ఆ జబ్బు కుర్రా డితో ఆ ఆడకూతురు వసారాలో పడుకో నిమ్మని ఎంత బతిమాలిందో...." యింకొకరు.

ఇంక అక్కడ వుండలేకపోయాడు మల్లయ్య. "రా.... రా...." అని రంగడ్ని తీసుకుని వూరువేపు దారి తీశాడు.

అంతకుముందు రాత్రి లక్ష్మి చాలా రకాలుగా బతిమాలింది మల్లయ్యని. మూడు రోజులుగా ఆస్పత్రిలో పడ్డ యాతనా, భర్త వూరెళ్ళటం ....కుర్రాడి జబ్బు పరిస్థితి.... మల్లయ్యకి అంతా గుర్తొస్తోంది.... అప్పుడు మిగిలినవాళ్ళ లాగే లక్ష్మినీ పట్టించుకోకుండా పొమ్మ న్నాడు. ఆ పసివాడు చచ్చిపోకపోతే

చాలాసేపు ఎక్కడెక్కడో తిరిగారు యిద్దరూ. అయినా జరిగిందేది మరుపు రావటం లేదు.

"ఆ.... నేనేమైనా కావాలని చేశా నేంటి. అందర్లాగే అన్నాను.... దబ్బివ్వలేదు... అందుకే వసారాలోకి రానివ్వలేదు. ఆ కుర్రాడికి రోజులు తీరాయి... చచ్చాడు.... అనుకున్నాడు మల్లయ్య...

రంగడికీ మనసు అదోలా వుంది.... ఏం మాట్లాడలేక, ఏం చెయ్యలేక మౌనంగా వున్నాడు.... మాట్లాడని రంగడ్ని చూసి.... చూసి.... "యీడు కాకపోతే మరోడు పుడతాడు... పిల్లలకి లోటేంటి.... దీనికి పెద్ద గొడవేంటి లేరా...." అన్నాడు మల్లయ్య.

"అవును గురూ... అంతే.... అంతే...." అన్నాడు రంగడు. అయినా అలా అనుకున్నా యిద్దరికీ తృప్తి లేదు... ఏదో యిబ్బంది....సాయంత్రం వరకు కూడా ఆగలేక సారా కొట్టుకి చేరారు.

తాగుతున్నా యిబ్బందిగానే వుంది మల్లయ్యకి. అసహ్యంగా వుంది.... చిరాగ్గా వుంది. విషయం తెలిసీ, తెలియ దని మభ్యపెట్టుకోటం దరిద్రంగా వుంది. ఏండ్లేళ్ళక్రితం యింత దరిద్రం లేదు తనకి. అప్పుడీ చలివ్యాపారం లేదు.... ఎదుటివాడి కష్టం సుఖం అందుకే రంగడ్ని చేరదీయగలిగాడు.... యిప్పుడు.... అలా కాదు.... తనలో ఏం లేదు....

మరింత తాగాడు. కారంగా ఏదేదో తిన్నాడు.... మంటగా వుంది.... ప్రశాంతంగా లేదు. చచ్చిపోయిన ఆ పసివాడి శవం జ్ఞాపకంలోంచి కదలటంలేదు. లక్ష్మి దైన్యం కళ్ళముందు కదుల్తోంది. ఆ దైన్యం తనకి పరిచయమున్నదే.... మమకారం, ప్రేమ తగ్గిపోతున్న లోకంలో మనిషిని పోగొట్టుకున్న దైన్యం.... "ఛీ ....ఎదవబతుకు...." పైకి గట్టిగానే అన్నాడు.

"ఏంటి గురూ...." అన్నాడు రంగడు వులిక్కిపడి....

"ఏం లేదులే.... తాగరా...." అన్నాడు మల్లయ్య.

వసారా దగ్గర జరింగిందాన్ని, తనలో జరుగుతున్నదాన్ని మరింతగా తాగి మరచిపోవా లనుకున్నాడు మల్లయ్య. తాగి, తాగి మధ్యలో వో క్షణం.... 'ఎందుకీ బతుకు.... ఒక్క పొట్ట.... రేపణ్ణించేనా సరిగా బతికితే పోలా....' అనుకున్నాడు ఎంతో నిజాయితీగా....

* * *

తెల్లారింది.... వో మురికాలువ పక్క.... యిళ్ళ మధ్యనుంచీ, జనానికి అడ్డుగా పారటమే తప్ప వేరే దారిలేని మురికాలువ పక్క నిద్ర లేచాడు

మల్లయ్య

తల దిమ్ముగా వుంది. నిన్న జరిగింది లీలగా గుర్తుంది. రాత్రి తాగి, తాగి ఆ మైకంలో వొళ్ళు అక్కడ పడ్డాడు. లేచి ఎదురుగా వో బడ్డీకొట్టు దగ్గరికెళ్ళి టీ తాగి ఏం చెయ్యటానికి యిష్టంలేనివాడిలా కూచున్నాడు. చాలా సేపు.

ఏం చెయ్యటానికీ దిక్కు తోచటం లేదు. ఏవరేనా ఏదేనా చేయిస్తే చెయ్యటానికి అలవాటుపడ్డ ప్రాణం.

మధ్యాహ్నానికి కబురందింది, కంట్రాక్టర్ సత్యనారాయణ అర్జంటు పనుంది రమ్మన్నాడని. మల్లయ్య కాసేపు వెళ్ళటమా మానటమా అని తటపటాయించాడు. వెళ్ళకపోతే ఎలా... ఆయన వసారా తనకి నీడ. వెళ్ళకపోటం విశ్వాసం కాదు..' వెళ్ళాడు.

అదే రోజు రాత్రి చీకట్లో వో అసిస్టెంట్ యింజనీర్ని పచ్చడికింద తన్నక తప్పలేదు మల్లయ్యకి.

మల్లయ్యకి మర్నాడు సత్యనారాయణ 'శభాష్' అని డబ్బిచ్చాడు. కొంత మంది మమకారానికి, కొంతమంది అధికారానికి బందీలు. కానీ మల్లయ్య ఏ శక్తికి బందీయో మల్లయ్యకే తెలియదు. సరుకుతోటీ కాక, కళ్ళతోటి, చలితోటి తోటి మనషుతోటి వ్యాపారం తన చుట్టూవున్న బతుకై పోయిందని మాత్రం మల్లయ్యకి తెలుసు. జీవితం ఆ మాత్రం నేర్పింది. భార్యని రౌడీతనంతో మరచిపోటం నేర్పింది. యిప్పుడు వో పసివాడి చావుని కొన్ని గంటల్లో మరిచిపోటం నేర్పుతోంది.

చేతినిండా డబ్బు. రాత్రి చేసిన పని మీద సుఖం ముసుగు కప్పాలి. తిరిగి మందు. చలిరాత్రి. సుశీల చావు అలవాటై పోతే ఎన్నిసార్లు చచ్చినా ఒకటే. మధ్యమధ్యలో వో క్షణం బతికినా ఆ బతుకు కష్టం.

'యింక మారేదేంటి... యీ బతుకింతే. యింక మారదు' అనుకున్నాడు మల్లయ్య రంగడ్ని కూడా తీసికెడుతూ.

